

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0

పీహెచ్‌సీల్లో సమస్యల తిష్ఠ

- కనీస సౌకర్యాలు కరువైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. దీంతో పాటు సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్నింటికి సొంత భవనాలు లేవు. ఉన్న వాటిలో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. కొన్ని భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని చోట్ల వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఇందుకు అధికారుల పర్యవేక్షణ లేకపోవడమూ ఓ కారణం. ఇలా పీహెచ్‌సీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యాయి. మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా పలు సమస్యలు తారసపడ్డాయి. మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా... అందుకు తగ్గట్టు కనీస వసతులు సమకూర్చకపోవడం గమనార్హం. జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, సిబ్బంది కొరత అధికంగా ఉన్నది. కనీసం తాగునీటి సదుపాయం కూడా లేక రోగులు, వారి వెంట వచ్చే వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటూ కనిపించారు. కొన్ని ఆసుపత్రుల భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు మొలచి దుర్గంధంగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల వైద్య పరికరాలు లేక రోగులు అవస్థలు పడుతున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి విజిట్

7

కొల్లాపూర్‌లో పరిస్థితి..

- కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైరల్ జ్వరాలతో వచ్చిన రోగులు అధికంగా కన్పించారు. ఎక్స్‌రే, స్కానింగ్ మిషన్ అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రికి కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా కల్పించకపోవడంపై అసహనం వ్యక్తం అవుతోంది.

పెబ్బేరులో దయనీయం..

- పెబ్బేరు పీహెచ్‌సీ పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. భవనం పైకప్పు పెచ్చులు ఊడుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ ఎప్పుడొస్తారో? ఎప్పుడు వెళ్లిపోతారో? తెలియడం లేదని రోగులు చెప్పున్నారు.



అలంపూర్ పీహెచ్‌సీలో అపరిశుభ్రత



పాన్‌గల్ పీహెచ్‌సీ ఆవరణంలో అసంపూర్తిగా నిర్మించిన మరుగుదొడ్డి



పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఊడి పడిన పెచ్చులు

కదిలిన దుందుభీ

- పాపగల్, సిర్సవాడ గ్రామాల్లోని చెక్‌డ్యాంలు నిండుకొని ప్రవహిస్తున్న నది
- రాత్రి కురిసిన వర్షాలతో గుంతకోడూరులో ఇళ్ల మధ్యకు నీరు
- మండలంలోని గొలుసుకట్టు చెరువుల్లోకి వెళ్తున్న వరద
- మాదారం- సిర్సవాడ గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



గుంతకోడూరు గ్రామంలో రాత్రి కురిసిన వర్షానికి ఇళ్ల మధ్యలో చేరిన వర్షపు నీరు



తాడూరు మండలం సిర్సవాడ గ్రామం వద్ద ప్రవహిస్తున్న దుందుభీ నది

తాడూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో దుందుభీ నది ప్రవాహం ప్రారంభమైంది. ఎగువన మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్, మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట తదితర మండలాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా దుందుభీలోకి వరద ప్రవాహం చేరింది. దీంతో మంగళవారం పాపగల్ గ్రామం వద్ద దుందుభీ ప్రవాహం మండలంలోకి అడుగు పెట్టింది. గత మూడు నెలలుగా దుందుభీ నదిలో ఉన్న చెక్‌డ్యామ్‌లు నీళ్ల లేక వెలవెలబోయాయి.

ఇటీవల కురుస్తున్న వర్షాలతో దుందుభీ నదిలోని చెక్‌డ్యామ్‌లన్నీ ఒకదాని తర్వాత ఒకటి నిండుకుంటూ నది ప్రవాహం కొనసాగుతోంది. దుందుభీ నది ప్రవాహం ప్రారంభం కావడంతో మండలంలోని సిర్సవాడ గ్రామం వద్ద ఊర్కొండ మండలంలోని మాదారం, సిర్సవాడ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా గుంతకోడూరు గ్రామంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్ల మధ్యకు నీరు చేరుకోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని భలాన్‌పల్లి, సిర్సవాడ, గోవిందాయపల్లితో పాటు తుమ్మలసూగురు, యత్మతాపూర్, ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, యంగంపల్లి, అల్లాపూర్, గ్రామాల్లో ఉన్న గొలుసుకట్టు చెరువుల్లోకి కురిసిన వర్షాలతో వరద నీరు చేరడంతో చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మొత్తంగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా అటు దుందుభీ, ఇటు చెరువులు జలకళను సంతరించుకున్న పరిస్థితి.

యువత విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఆదర్శ సురభి



ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న కలెక్టర్

వనపర్తి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యువతకు టాటా కన్సల్టెన్సీ ద్వారా ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రాంగణ నియామకాలు ఇచ్చే వృత్తి విద్యా కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ సురభి సూచించారు. మంగళవారం వనపర్తి మండలం నాగవరం వద్ద ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టి.ఐ)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత చెందిన యువతకు ఆయా రంగాల్లో ఆధునిక వృత్తి శిక్షణ ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నుంచి టాటా కన్సల్టెన్సీతో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా టాటా కన్సల్టెన్సీ వారు ఆధునిక యంత్రాలు, పరికరాలతో అడ్వాన్స్ శిక్షణ కేంద్రాన్ని (ఎ.టి.సి) ఏర్పాటు చేస్తున్నారు.

కోపా, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ వంటి కోర్సులతో పాటు ఆధునిక రోబోటిక్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఆర్టిసిజమ్, అడ్వాన్స్ మెషీనింగ్ టెక్నీషియన్ వంటి మొత్తం 10 కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రాంగణ నియామకాలు సైతం చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వారం రోజుల్లో కొత్తగా ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడుతుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రంలో జరుగుతున్న తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వై.టి.సి కేంద్రం (ప్రస్తుతం మెడికల్ కళాశాల బాలుర వసతి గృహం) భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవనానికి ఏమైనా మరమ్మతులు అవసరం ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనం ఆవరణలో ఒక కమ్యూనిటీ ఇంకుడు గుంత నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పి.డి.డి ఆర్డీవో ఉమాదేవి, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కే రమేష్ బాబు, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.

మెరుగైన విద్యాబోధనే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ బదావత్ సంతోష్



విద్యార్థులకు లెక్కలు బోధిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బిజినేపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మండలంలోని నంది వడ్డెమాన్‌లోని ఎస్సీ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. పాఠశాల భవనం శిథిలమై ప్రమాదభరితంగా ఉండటంతో గ్రామంలోని మరో ప్రభుత్వ పాఠశాలలోని గదుల్లో విద్యార్థులకు బోధన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సాధన సామార్థ్యాలను పరిశీలించిన కలెక్టర్ ఉపాధ్యాయుడిగా మారి లెక్కలు బోధించారు. రాష్ట్ర ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి, డీఈవో రమేష్ బాబు, ఎంఈవో రఘునందన్ శర్మ, తహసీల్దార్ మునీరుద్దీన్, హెచ్‌ఎంలు హనుమంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు వీరశేఖరాచారి, జగత్ చంద్రయ్య, రేమొదుల రమేష్, మ్యాతరి సత్యం తదితరులు ఉన్నారు.

క్యాతూరు లిఫ్ట్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన రైతులు



సాగునీటి శాఖ ఏఈకి వినతి పత్రం ఇస్తున్న క్యాతూరు గ్రామ రైతులు

అలంపూరు చౌరస్తా, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల పాటు రిజిష్టర్ లేకుండా, అకౌంట్ లేకుండా కమిటీ చైర్మన్‌నని ప్రకటించుకుని పన్ను వసూలు చేసిన జెన్‌పల్లి చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ చందుపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాసరావును కోరారు. అలంపూరు మండలం, క్యాతూరు గ్రామంలోని హరిహర లిఫ్ట్ కిందసాగు చేసే రైతులంతా మంగళవారం ఎస్పీ కార్యాలయం లో ఎస్పీని కలిశారు. రైతులందరం కలిసి లిఫ్టును మరమ్మతులు చేయిస్తే చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి వచ్చి తాళం వేసుకున్నాడని, పైగా అతను గత ఆరేళ్ల పాటు అక్రమంగా వసూలు చేసిన పన్ను సొమ్ముపై విచారణ చేయాలని ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని అలంపూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై వెంకటస్వామిని ఆదేశించినట్లు రైతులు తెలిపారు. అంతకుముందు వారంతా సాగునీటి శాఖ కార్యాలయానికి వెళ్లారు. ఇక నుంచి లిఫ్ట్ నిర్వహణ బాధ్యతలు మొదట్లో ఏర్పడిన కమిటీయే చూసుకుంటుందని సదరు కమిటీ చైర్మన్ విక్రంసేనా రెడ్డి ఆధ్వర్యంలో రైతులంతా ఏఈ నరసింహారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. జె.శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విక్రంసేనారెడ్డి, కమలేశ్వర్‌రెడ్డి, నరసింహ, సామేలు, రామచంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం

- నల్లమలలోని కండ్లకుంట భూ సమస్యను పరిష్కరించాలని చెంచుల తీర్మానం



స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని తీర్మానం చేస్తున్న చెంచులు

6

జలవిద్యుత్ కేంద్రం పనితీరు అద్భుతం

- శ్రీశైలం దేవస్థానం ఈవో వెల్లడి
- డ్యాం గేట్ల ఎత్తివేత కార్యక్రమానికి హాజరు



శ్రీశైలం ఈవోకు పూలమొక్కను బహూకరిస్తున్న జెన్‌కో సీఈ సత్యనారాయణ, ఇంజనీర్లు

6

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

- పరారీలో మరో నిందితుడు
- రూ. 15 లక్షల విలువైన సిగరెట్ కాటన్లు, వ్యాన్ స్వాధీనం
- జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

7

ప్రేమ, పెళ్లి పేరుతో వంచన

- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన యువతి

లభ్యంకాని మహేశ్ మృతదేహం

7

- కొనసాగుతున్న గాలింపు చర్యలు

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- దొంగతనాలు జరుగకుండా గస్తీ నిర్వహించాలి
- ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ రావుల గిరిధర్



పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ పోలీసులు సేవలు అందిస్తేనే ప్రజలకు నమ్మకం కలుగుతుందని ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. ఆత్మకూర్ ఠాణాను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలను స్టేషన్ రికార్డులను సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పట్టణంలో యువత గంజాయి, బెట్టింగ్ గేమ్స్, గాంబ్లింగ్, మత్తు పదార్థాలు వంటి వాటికి అలవాటు పడకుండా సమాచారం సేకరించి ఎప్పటికప్పుడు యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రాత్రి వేళలో దొంగతనాలు జరగకుండా గస్తీ నిర్వహించాలని ప్రతీ ఒక్క వార్డుకు గ్రామానికి వీపీవోను కేటాయించి సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకుని అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి సమాచారాన్ని రాబట్టాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న కారణంగా పోలీసులు అప్రమత్తతతో విధులు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. అలాగే నమోదైన కేసులలో జాప్యం వహించకుండా బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు.

● గణేష్ ఉత్సవాలలో డీజే నిషేధం

త్వరలో రాబోతున్న గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద అలాగే నిమజ్జనం రోజున డీజే సౌండ్‌లో భక్తులు ఏర్పాటు చేస్తుంటారు. కావునా రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీజే సౌండ్లను నిషేధించినట్టు వెల్లడించారు. సాంప్రదాయబద్ధంగా శబ్ద కాలుష్యాన్ని నివారించడానికి జిల్లాలోని గణేష్ మండపాల నిర్వాహకులు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. షేర్ బ్యాండ్, సన్నాయి, డిల్లెం బల్లెం, కోలాటం, చెక్క భజన, పండరి భజన వంటి ప్రదర్శనలతో ఉత్సవాలు జరుపుకుంటే శబ్ద కాలుష్యాన్ని నివారించే దేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడిన వారం అవుతామని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం 223, 280, 293, 324 కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వెల్లడించారు. ఆత్మకూరు శిక్షణ ఎస్‌ఐ హిమబిందుతో సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

● డీఈవో కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

నారాయణపేటటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడుతూ తొమ్మిది నెలల కూరగాయల బిల్లులు, 16 నెలల కోడిగుడ్ల బిల్లులు, ఏరియస్ వేతనాలు 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లా మొత్తంగా మూడు కోట్లకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అకారణంగా తొలగించిన వంట ఏజెన్సీని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. బిల్లులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తే ఈనెల 28న మరోసారి జిల్లా అధికారి కార్యాలయం ముందు ధర్నాకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈవో గోవిందరాజులుకు, కార్యాలయం అధికారి యాదయ్యశెట్టికి అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మరికల్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య, పద్మమ్మ, తిరుపతమ్మ, బాలమణి, యాదమ్మ తదితరులున్నారు.



రాస్తారోకో చేస్తున్న ఆటో కార్మికులు

హామీలు అమలు చేయాలి

మరికల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ముందు రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రతీ ఆటో కార్మికుడికి రూ.12 వేల ఇస్తామని చెప్పి నేటివరకు అమలు చేయలేదన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్‌ను అమలు చేయాలన్నారు. కాగా, తహసీల్దార్ కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఉన్నందున ఫోన్‌లో కార్మికులతో మాట్లాడారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో కుర్మన్న, సంతోష్, ఆనంద్, నర్సిములు, రాజ్‌రెడ్డి, కురుమూర్తి, కిషన్‌నాయక్ తదితరులున్నారు.

పోలేపల్లి మాజీ ఉప సర్పంచ్‌కు నోటీసు

జడ్చర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలెపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ లావణ్యకు నోటీసులు జారీ అయ్యాయి. గ్రామ పంచాయతీ నిధులు రూ.1.70 కోట్లకు పైగా దుర్వినియోగం అయిన అంశంలో ఈనెల 16న కలెక్టరేట్‌లోని పంచాయతీ విభాగం అధికారులు నోటీసు జారీ చేశారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు నిధుల అవినీతి, అక్రమాలపై ఇప్పటికే మాజీ సర్పంచ్ చేతనారెడ్డి, ఆమె భర్త రాంచంద్రారెడ్డి, అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శితో విచారణ చేపట్టారు. తాజాగా మాజీ సర్పంచ్ లావణ్యకు నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలంటూ నోటీసులో పేర్కొన్నారు.

నా ప్రమేయం లేదు : లావణ్య

గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం, అవినీతి, అవకతవకల అంశంలో నా ప్రమేయం లేదు. గ్రామ పంచాయతీ చెక్కులపై సంతకాలు చేసిన ప్రతీసారి వివరాలు అడిగితే మేమే చూసుకుంటాం, సంతకాలు పెట్టాలని సర్పంచ్, సర్పంచ్ భర్త ఇద్దరు కోరారు. వారిపై ఉన్న గౌరవం, నమ్మకంతో సంతకాలు చేశాను. డీఎల్పీవో విచారణలో రూ.1.73 కోట్ల దుర్వినియోగం అయ్యాయని ఇచ్చిన నివేదికలో నా పేరు లేదు. త్రిసభ్య కమిటీ నివేదికలో సర్పంచ్ సలహాతో తన పేరు చేర్చి, ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తున్నారు.

దురుసుగా ప్రవర్తించిన వాచ్‌మన్

● వారం రోజులు సస్పెండ్ చేసిన పాఠశాల ప్రిన్సిపాల్

జడ్చర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి తల్లిదండ్రులపై గురుకుల పాఠశాల వాచ్‌మెన్ దురుసుగా ప్రవర్తించిన సంఘటన జడ్చర్ల మునిసిపాలిటీ ఆలూరు వెళ్లే దారిలో ఉన్న నవాబ్‌పేట మండల సాంఘిక, సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాలలో చదువుకుంటున్న తన కుమారుడిని కలిసేందుకు మంగళవారం ఓ విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంలో విద్యార్థి తల్లిదండ్రులకు, వాచ్‌మెన్ మధ్య జరిగిన వాగ్వాదం, ఒకరికొకరు తోసుకునే వరకు దారితీసింది. దీంతో తనకు సంబంధం లేని అంశంలో విద్యార్థి తల్లిదండ్రులతో దురుసుగా వ్యవహరించినందుకు వాచ్‌మెన్ బ్రహ్మను వారం రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లింగం తెలిపారు.

కొలిక్కిరాని టీచర్ల సర్దుబాటు


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, వెంకటేష్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని విద్యాశాఖ సూచించినా ఆ నిబంధనలు పూర్తిగా తెలికపోవడం ఎంఈవోలకు తలనొప్పిగా మారింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సర్దుబాటు ప్రక్రియపై కసరత్తు చేసినా అది కొల్కిరాక పోవడంతో అక్కడి నుంచి కమిటీ సభ్యులు డీఈవో వద్దకు వెళ్లారు. ఈ ప్రకియ పూర్తి కావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాత్రం కలెక్టర్ సూచించిన విధంగానే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ వినతి పత్రాలు ఇచ్చారు. ఈ విషయంపై డీఈవోను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఉపాధ్యాయులు సర్దుబాటు జరుగుతుందన్నారు.

కాకర్లపాడులో వైద్య బృందం పర్యటన

నవాబ్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లపాడు గ్రామంలో మంగళవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి అశోక్‌రాజు పర్యటించారు. గ్రామానికి చెందిన పోషయ్యకు చికున్ గున్యా సోకడంతో చుట్టుపక్కల ఇళ్లను పరిశీలించి పైరాత్రం మందును పిచ్చికారి చేయించారు. ఇంటింటి జ్వర సర్వే చేశారు. ఇంటిముందున్న డ్రమ్ములు, పాత టైర్లలో నీరు లేకుండా పారబోశారు. సుశీల, జయమ్మ, శరబలింగం, రమణ, కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీ

జడ్చర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల కొత్త బస్టాండులో ల్యాప్‌టాప్ చోరీ అయ్యిందంటూ కర్నూల్‌కు చెందిన పరుచూరి సాయికార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ బస్సులో కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. కాగా జడ్చర్ల కొత్త బస్టాండులో బస్సు ఆగిన సందర్భంలో చూసుకోగా తన ల్యాప్‌టాప్ బ్యాగు కనిపించలేదని, చోరీ జరిగినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు.

అధిక వసూళ్లపై చర్యలు తీసుకోవాలి


వినతి పత్రం ఇస్తున్న గోరక్షకులు

చిన్నచింతకుంట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని బజరంగ్ దళ్ పాలమూరు గోరక్షా ప్రముఖ్ సందీప్ నాయుడు, రవి, సందీప్, రాజశేఖర్, నాని మంగళవారం కురుమూర్తి ఆలయ ప్రాంగణంలో చైర్మన్ గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. టెంకాయలు అధిక ధరలు వసూలు చేస్తున్నారని, గోశాల ప్రాంగణం నుంచి పంపిస్తున్న ఆవు దూడలు చిన్నదర్పల్లి గోశాలకు చేరడం లేదని అన్నారు.

డ్రైవింగ్ చేసే సమయంలో

అప్రమత్తంగా ఉండాలి

● ఆర్ఎస్ఐ శివశంకర్ ● వాహన డ్రైవర్లకు ఒక రోజు శిక్షణ


మాట్లాడుతున్న ఆర్ఎస్ఐ శివశంకర్

నారాయణపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎస్ఐ శివశంకర్ అన్నారు. మంగళవారం ఎస్పీ కాన్ఫరెన్స్ కార్యాలయంలో పోలీస్ మోటర్ వాహన డ్రైవర్లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరాన్నుద్దేశించి ఆయన మాట్లాడారు. డ్రైవర్లు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. వాహనాలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనాల మెకానిజంపై అవగాహన కల్గి ఉండాలన్నారు. రోజూ వాహనాలను తూడ్చి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

యూరియా కొరత లేదు: ఏడీఏ రామకృష్ణ

కోస్గి రూరల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కోస్గి డివిజన్‌లో ఎలాంటి యూరియా కొరత లేదని ఏడీఏ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ

కోస్గి డివిజన్ పరిధిలోని గుండుమాల్, కొత్తపల్లి, మద్దూర్ మండలాల్లో తగినంత యూరియా అందుబాటులో ఉందన్నారు. ఆగ్రోస్, పీఏసీఎస్, హెచ్ఏసీఏ, ప్రైవేట్ డీలర్ల ద్వారా అవసరమున్నంత మేరకు రైతులు యూరియా పొందవచ్చన్నారు. డీలర్లు ఇతర రాష్ట్రాలకు యూరియా ఎగుమతి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సరఫరాలో సమస్యలు ఉంటే తమ పరిధిలోని వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

జలవిద్యుత్ కేంద్రం పనితీరు అద్భుతం

- శ్రీశైలం దేవస్థానం ఈవో వెల్లడి

బ్రహ్మగిరి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రం పనితీరు అద్భుతమని శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు కొనియాడారు. అంతకు ముందు శ్రీశైలం డ్యాం గేట్ల ఎత్తివేత కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం విద్యుత్ కేంద్రం సందర్శనకు వెళ్లిన ఆయనకు జెన్‌కో సీఈ కేవీవీ సత్యనారాయణ స్వాగతం పలికి శాలువాతో సన్మానించి పూల మొక్కను బహూకరించారు. అనంతరం విద్యుత్ కేంద్రాన్ని కలియ తిరిగి చూపించి విద్యుత్ అయ్యారు చేసే విధానాన్ని ఇంజనీర్లు వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ విద్యుత్ కేంద్రానికి పక్కనే శ్రీశైలంలో ఉన్నప్పటికీ ఈ అద్భుతాన్ని చాలా ఆలస్యంగా చూశానని, భూగర్భంలో ఇంతటి అద్భుంతంగా విద్యుత్ కేంద్రం ఉండటం నమ్మలేని నిజమని ఆయన పేర్కొన్నారు. ఇంజనీర్లకు ఈవో తీర్థ ప్రసాదం అందించారు. జెన్‌కో ఎస్ఈలు, రవింద్రకుమార్, ఆదినారాయణ, డీఈ శ్రీకుమార్‌గౌడ్ ఎస్‌పీఎఫ్ ఆర్ఐ రవికుమార్, ఎస్ఐ అనుఫ్‌కుమార్, జెన్‌కో, దేవస్థానం ఉద్యోగులు తదితరులున్నారు.

జోగుళాంబ ఆలయంలో మాజీ ఎంపీ పూజలు


మాజీ ఎంపీ వినోద్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం బీఆర్ఎస్ హనుమకొండ మాజీ ఎంపీ వినోద్ ఆయన సతీమణి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంలో మాజీ ఎంపీ వినోద్‌కు ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామివారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శదర్శనం, అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు చేశారు.

సింగిల్‌విండో సొసైటీలతో రైతులకు ప్రయోజనాలు

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సింగిల్‌విండో ద్వారా బహుళ ప్రయోజనాలు ఉంటాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విండో కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన డైరెక్టర్లతో వానాకాలంలో రైతులకు అందించే పంట రుణాలు, ఎరువులు, విత్తనాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ దేశవ్యాప్తంగా 10వేల ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజర్స్ ఏర్పాటు భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 319 ఎల్డీవోలు, వనపర్తి జిల్లాలో 6 ఎఫ్‌పీవోలు ఉన్నాయని తెలిపారు. మండలంలోని కేతేపల్లిలో నూతనంగా సింగిల్‌విండో కార్యాలయం ఏర్పాటు కానుందని తెలిపారు. వానాకాలంలో రైతులకు పంట రుణాల కోసం రూ.50 లక్షలు అందించే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ బాలయ్య, సీఈవో భాస్కర్‌గౌడ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తాం

- కండ్లకుంట భూ సమస్య పరిష్కరించాలని చెంచుల తీర్మానం

అమ్రాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని కండ్లకుంట భూమి సమస్యను పరిష్కరించకపోతే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను తాము బహిష్కరిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆదిమ జాతి చెంచులు మంగళవారం సామూహికంగా తీర్మానం చేసుకున్నారు. కొన్ని దశాబ్దాలుగా తాము సుమారు 300 ఎకరాల కండ్లకుంట భూములను నమ్ముకుని జీవిస్తున్నామని, 20 ఏళ్ల నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారుల చుట్టూ తిరిగినా తమకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతిమంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు భూవివాద సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పామాయిల్ సాగుతో బంగారు భవిష్యత్తు

● జిల్లా ఉద్యానవనశాఖ అధికారి అక్బర్‌బాషా



అవగాహన, శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్‌బాషా

ఎర్రవల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ సాగుతో రైతుల భవిష్యత్తు బంగారు మయంగా ఉంటుందని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి అక్బర్‌బాష అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి దగ్గర విజయ ఆయిల్ మిల్లులో మంగళవారం గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో పంచాయతీ సెక్రటరీలు, ఏపీవోలు, ఇంజనీరింగ్ టెక్నికల్ అసిస్టెంట్‌లు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికి గాను జిల్లాలో 3500 ఎకరాలు సాగుకు లక్ష్యంగా కేటాయించినట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని టీజీ ఆయిల్‌ఫెడ్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. పామాయిల్ సాగుతో రైతుకు 30 సంవత్సరాల స్థిరమైన ఆదాయం ఉంటుందని, అలాగే అంతర పంటలతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. నాణ్యమైన మొక్కలను ప్రభుత్వ పరంగా రూ.20కే అందజేస్తామన్నారు. సబ్సిడీతో పాటు పంట నిర్వహణకు నగదును కూడా రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన కల్పించి అన్ని వివరించాలని పెర్కొన్నారు. కార్యక్రమంలో టీజీ ఆయిల్ ఫెడ్ ఇన్‌చార్జి నాగిరెడ్డి, ఉద్యాన అధికారి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఇన్సులిన్



అందుబాటులోకి వచ్చిన ఇన్సులిన్ మందు

వనపర్తి వైద్యవిభాగం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇన్సులిన్ అందుబాటులోకి వచ్చింది. ఏడు నెలలుగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇన్సులిన్ మందు సరఫరా నిలిచి పోయిందని 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 9న ఇన్సులిన్ ఇస్తలేరు అని అని ప్రచురితమైన కథనాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వ మందుల సరఫరాల కేంద్రం నుంచి ఇన్సులిన్ మందు తెప్పించారు. మంగళవారం ఇన్సులిన్ మందు జిల్లాలోని అన్ని కేంద్రాలకు పంపిణీ చేశారు. జిల్లాలోని టైప్-1 షుగర్ వ్యాధిగ్రస్తులు ఇక నుంచి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా పంపిణీ చేసే ఇన్సులిన్ మందును సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు తెలిపారు.

నల్లమలలో సినీనటుడు దువ్వాసి మోహన్ సందడి


సినీ నటుడు దువ్వాసి మోహన్‌తో అభిమానులు

మన్ననూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నల్లమల అభయారణ్య ప్రాంతంలో సినీనటుడు దువ్వాసి మోహన్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం పర్యటించారు. శ్రీశైలం దైవదర్శనానంతరం హైదరాబాద్ వెళుతూ మన్ననూరులోని దాబా వద్ద ఆగారు. గ్రామంలోని అభిమానులు దువ్వాసి మోహన్‌తో ఫొటోలు దిగి సినిమా ముచ్చట్లు అడిగారు. 500లకు పైగా సినిమాల్లో నడించానని అభిమానులతో తన చిత్ర సీమ, నటనా అనుభవాలను పంచుకున్నాడు.

రోగులకు ఇబ్బందులు రానీయొద్దు

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు 11 కేవీ విద్యుత్ లైన్‌ను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చేరోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిరంతరం విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ అధికారులు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నేరుగా ఆసుపత్రికి లైన్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఆసుపత్రిలో విద్యుత్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆ విద్యుత్ లైన్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆగస్టు 6వ తేదీ నుంచి మెగా సర్జికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని, ఆరోగ్య సమస్యలు ఉన్న వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ఆంజనేయులు, నాయకులు గౌరీశంకర్, రామనాథం, నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఎంపీసీ సీట్ల ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

చారకొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 12 ఖాళీ సీట్లను భర్తీ చేస్తున్నట్లు ఎస్‌వో మంజుల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి గల విద్యార్థినులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో కేజీబీవీ కళాశాలకు వచ్చి అడ్మిషన్‌లు పొందవచ్చని ఎస్‌వో తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక

పెద్దకొత్తపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.శేఖర్ (పదవ తరగతి) అథ్లెటిక్స్ జావెలిన్ త్రో విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని ఎంఈవో కే.శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జావెలిన్ త్రో విభాగంలో ప్రతిభ కనబర్చి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని తెలిపారు. జనగామ జిల్లాలో ఆగస్టు 7వ తేదీన నేషనల్ జావెలిన్ త్రో డే సందర్భంగా నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు. ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు విద్యార్థి శేఖర్‌ను అభినందించారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.శ్రీధర్‌కు ఘన సన్మానం


లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన చిగుళ్లపల్లి శ్రీధర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కల్వకుర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ కల్వకుర్తి నూతన కమిటీని వాసవిక్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్, కార్యదర్శి కల్మిచెర్ల గోపాల్, కోశాధికారి మిరియాల శ్రీనివాస్‌రెడ్డిని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలురు రమేష్‌బాబు, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ రమేష్ ఆధ్వర్యంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు బాదం రాఘవేందర్ శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సేవలు మరింత ముందుకు తీసుకెళ్తామని జూలూరి రమేష్‌బాబు కోరారు. ఈ కార్యక్రమంలో మాచి పెద్ది రవి, గుబ్బ కిషన్, జూలూరు ప్రకాశ్, మాచిపెద్ది అశోక్ పాల్గొన్నారు. సుమన్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సమస్యల తిష్ఠ

» కనీస సౌకర్యాలు కరువు » మూడేళ్లుగా మంజూరు కాని నిధులు » మందుల కొరతతో ఇక్కట్లు
» సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది » కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి విజిట్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని (పీహెచ్‌సీలు) సమస్యలతో సతమతం అవుతున్నాయి. పీహెచ్‌సీలకు ప్రతీ రోజు 60 నుంచి 120 మంది వరకు రోగులు వస్తున్నా, వైద్య సేవలు మాత్రమే అంతంత మాత్రంగానే ఉన్నాయి. డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. వస్తున్నాం.. వెళ్తున్నాం.. అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం మూడేళ్లుగా నిధులు ఇవ్వకపోవడంతో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మందులు కూడా అరకొరగానే వస్తున్నాయి. చాలా పీహెచ్‌సీలలో సిబ్బంది కొరత ఉంది. దీంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ప్రధానంగా రాత్రి వేళల్లో అందుబాటులో ఉండడం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలను 'ఆంధ్రజ్యోతి' మంగళవారం విజిట్ చేసింది. ఈ సందర్భంగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. వివరాలిలా ఉన్నాయి.



జానంపేట పీహెచ్‌సీకి చికిత్స కోసం అధిక సంఖ్యలో వచ్చిన రోగులు

- మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని పీహెచ్‌సీలో ఆయుర్వేదిక్ వైద్యులు పనిచేస్తున్నారు. సరిపడ మందులు ఉన్నప్పటికి రోగులకు మాత్రం 2, 3 రోజులకే ఇస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.
- గండీడ్, దేవరకద్ర పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత ఉంది.
- భూత్పూర్ పీహెచ్‌సీలో ఉండే డాక్టర్ డిప్యూటేషన్‌పై జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. యోగా సెంటర్ మూతపడింది.
- కోయిలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌సీగా స్థాయి పెరిగినా, పోస్టులు కేటాయించలేదు. సిబ్బంది, వైద్యులు మధ్యాహ్నం 12 గంటలకే జిల్లా కేంద్రానికి వచ్చేస్తున్నారు. సమయ పాలన పాటించడం లేదు. దీంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు.
- సీసీ కుంట పీహెచ్‌సీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగడానికి నీళ్లు లేవు. డాక్టర్, 2 సూపర్‌వైజర్, 8 ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సరిపడా పడకలు లేవు.
- రాజాపూర్ పీహెచ్‌సీలో తాగునీరు లేకపోవడంతో రోగులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఉంది.
- నవాబ్‌పేట పీహెచ్‌సీలో సరిపడ పడకలు లేవు. మంచాలు లేక బెంచీ లపై పడుకోబెట్టి చికిత్స చేయాల్సి వస్తోంది. .
- జానంపేట పీహెచ్‌సీలో 3 రెగ్యులర్ ఎఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వైద్యులు, సిబ్బంది కొరత



గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

గద్వాల (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పీహెచ్‌సీలో వైద్యులు, నర్సుల కొరత ఉంది. భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. గట్టులో రెండవ వైద్యుడిని నియమించినా, రాత్రి వేళ వైద్యుడు విధుల్లో లేక ఇబ్బందులు కలుగుతున్నాయి. మొత్తం 11 మంది ఏఎన్ఎంలకు ముగ్గురే ఉన్నారు. ఆరుగురు హెల్త్ అసిస్టెంట్లకు గాను, నలుగురు మాత్రమే ఉన్నారు. ధరూర్‌లో వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసిన సమయానికి వైద్యుడు, ఫార్మసిస్ట్ అందుబాటులో లేరు. శాంతినగర్‌లోని పీహెచ్‌సీలోనూ మందుల కొరత ఉంది. మానవపాడులోని పీహెచ్‌సీలో టెక్నీషియన్ లేకపోవడంతో ఏఎన్‌ఎంలే రక్త నమూనాలు తీసి పంపిస్తున్నారు. క్యాతూరు పీహెచ్‌సీలోనూ మందుల కొరత ఉంది. గట్టు, అయిజ, క్యాతూరు పీహెచ్‌సీల్లో పీహెచ్‌సీలో తాగునీటి కొరత ఉంది. వడ్డేపల్లి, రాజోలి పీహెచ్‌సీల్లో పరిశుభ్రత కొరవడింది. అయిజ పీహెచ్‌సీ భవనం శిథిలమైంది. కేటీదొడ్డి, ఉండవెల్లి, ఎర్రవల్లి మండల కేంద్రాల్లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేయలేదు. గత ఏడాది కేటీదొడ్డిలో ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన తాత్కాలిక కేంద్రం కొద్ది రోజులకే మూత పడింది.

సాధారణ ప్రసవాలకే పరిమితం



మరికల్‌లో పీహెచ్‌సీలో వైద్యుడి కోసం నిరీక్షిస్తున్న రోగులు

నారాయణపేట (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలోని పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు మాత్రమే చేస్తున్నారు. సీజేరియన్ కోసం గర్భిణులను మక్తల్, నారాయణపేట, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రు లకు పంపిస్తున్నారు. కర్ని ప్రభుత్వ ప్రాథమిక అరోగ్య కేంద్రానికి సిబ్బంది అలస్యంగా వచ్చారు. మాగనూరు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్ మాత్రమే డ్యూటీలో ఉన్నారు. డాక్టర్ అఫ్రోజ్ పాషాను ఫోన్‌లో వివరణ కోరగా, లీవ్‌లో ఉన్నానని తెలిపారు. కృష్ణ మండలంలోని కున్సీ సబ్‌సేంటర్‌లో టీబీ హెల్త్ క్యాంపు ఉండడంతో సిబ్బంది అక్కడికి వెళ్లినట్లు డాక్టర్ తెలిపారు. ఊట్కూర్ పీహెచ్‌సీలో ఇన్సులిన్ కొరత ఉండటంతో షుగర్ బాధితులు ఇబ్బంది పడ్తున్నారు. కోటకోండ ప్రభుత్వ ప్రాథమిక అరోగ్య కేంద్రలో సిబ్బంది కోరత తీవ్రంగా ఉంది. గుండుమాల్ పీహెచ్‌సీలో సూపర్‌వైజర్, మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సరిపడ బెడ్లు లేవు. కృష్ణ మండల కేంద్రంలో పల్లె దవాఖాన నిరుపయోగంగా ఉంది. మద్దూర్ ప్రభుత్వ అసుపత్రిని విజిట్ చేయగా 6గురు వైద్య విధుల్లో కనిపించారు. అధిక సంఖ్యలో రోగులు రావడంతో ఫార్మసిస్టు వద్ద కొంత ఇబ్బంది నెలకొన్నది.

అరకొర వసతులతో అవస్థలు

వనపర్తి వైద్యవిభాగం, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ కేంద్రాలు, సబ్ సెంటర్లలో వైద్యుల కొరత, అరకొర మందులు, సమయపాలన, శిథిలావస్థకు చేరిన భవనాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గోపాల్‌పేట పీహెచ్‌సీకి అంబులెన్స్ సౌకర్యం లేదు. పాన్‌గల్, పెబ్బేరు పీహెచ్‌సీల భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీపనగండ్ల పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. అమరచింత పీహెచ్‌సీని ప్రైమరీ హెల్త్ సెంటర్ చేస్తామని స్వయంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు.



అమరచింతలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సిబ్బంది లేక ఇబ్బంది

నాగర్‌కర్నూల్ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరత, టెక్నీషియన్లు లేక రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదు.
- ఊర్కొండ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక తోటపల్లి పీహెచ్‌సీకి అనుసంధానం చేయడంతో మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ రోజు 80 నుంచి 110వరకు అవుట్ పేషెంట్లు వస్తున్నారు. స్టాఫ్‌నర్సు కాంటిన్‌జెన్సీ వర్కర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రి భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో, మూడేళ్ల నుంచి ఐకేపీ భవనంలో కొనసాగిస్తున్నారు.
- అచ్చంపేట వంద పడకల ఆసుపత్రిలో పది మంది వైద్యులకు గాను, ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారిలో ముగ్గురు కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్న వైద్యులు కూడా తమ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లకే ప్రాధాన్యం ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి.
- పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్ లేరు. ల్యాబ్ ఉన్నా టెక్నీషియన్ లేక రక్త పరీక్షలు చేయడం లేదు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న 300 పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగ్గానే ఉన్నాయి.

క్రైం కార్నర్

లభ్యంకాని మహేశ్ మృతదేహం

» కొనసాగుతున్న గాలింపు చర్యలు



మృతదేహం కోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ధరూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల పరిధిలోని జూరాల ప్రాజెక్టుపై కారు, బైక్ ఢీకొని నీటిలో పడి గల్లంతైన యువకుడు మహేశ్ మృతదేహం ఇప్పటివరకు లభ్యం కాలేదు. రెండు రోజులుగా ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లు డ్యాం పరిసర ప్రాంతాలతో పాటు బీచుపల్లి, గుర్రంగడ్డ, సోమశిల తదితర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని మంగళవారం ఉదయం డీఎస్పీ మొగులయ్య, సీఐ టంగుటూరి శ్రీనివాసులు, ధరూర్ ఎస్ఐ కొండా శ్రీహరి పరిశీలించారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో మహేశ్ తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధరూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ హుసేన్ తెలిపిన వివరాల ప్రకారం... జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని కోతులగిద్ద గ్రామానికి చెందిన బుడకల నరసింహులు (37) తాగుడుతో పాటు చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. దీంతో ఈ నెల 14న భార్య హేమలత మందలించింది. దీంతో క్షణికావేశానికి గురైన అతడు పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గద్వాల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కుక్కల దాడిలో 30 గొర్రెల మృతి

జడ్చర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి చెందాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని తుప్పుడుగడ్డ తండాకు చెందిన లష్కర్‌నాయక్ తన గొర్రెలను సోమవారం రాత్రి తండాకు సమీపంలో ఏర్పాటు చేసిన కంచెలో ఉంచాడు. మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రెలు చనిపోయాయి. వాటి విలువ దాదాపు లక్ష రూపాయలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు లష్కర్‌నాయక్‌ను పరామర్శించారు. మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అందిం చిన రూ. 25 వేలను బాధితుడికి ఇచ్చారు. కార్యక్రమంలో బాదేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌గౌడ్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రణీల్‌చందర్, ఇంతియాజ్‌ఖాన్, రఘుపతిరెడ్డి, శంకర్‌నాయక్, రవి ఉన్నారు.

మాట కలిపి.. మాయ చేసి..

» బంగారు గొలుసు చోరీ - 'పేట' బస్టాండ్‌లో ఘటన

నారాయణపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బస్సు కోసం వేచి ఉన్న ఓ మహిళతో మరో ఇద్దరు మహిళలు మాటలు కలిపి, మాయ చేసి ఆమె మెడలోని బంగారు గొలుసు, కాళ్ల పట్టీలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నారాయణపేట ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూర్ మండలం పెద్దజట్రం గ్రామానికి చెందిన లక్ష్మి తమ ఊరికి వెళ్లేందుకు బస్టాండ్‌లో వేచి ఉంది. ఆమె వద్దకు బురకా దరించిన ఇద్దరు మహిళలు వచ్చి మాటలు కలిపారు. దుస్తులపై పురుగు ఉందని, తీసేస్తామని చెప్పి బస్టాండ్ అవరణలోని డబ్బాల వెనక్కు తీసుకెళ్లి ఏదో వాసన చూపించడంతో ఆమె మత్తులోకి జారుకున్నది. వెంటనే ఆమె మెడలోని అరతులం బంగారు గుండ్ల నల్ల పూసల దండ, కాళ్లకు ఉన్న పది తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లిపోయారు. కొద్దిసేపటికి మేల్కొన్న బాధితురాలు మోసాన్ని గుర్తించి విలపించింది.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

» మార్కెట్ డైరెక్టర్‌కు గాయాలు

నవాబ్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ గోవిందుగారి శివకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివకుమార్ మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కొండాపూర్ చౌరస్తా వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొన్నది. అది బైక్‌ను కొద్దిదూరం ఈడ్చుకెళ్లడంతో అతడి పైపుపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆటోను అడ్డుకున్నారు. బాధితుడు శివకుమార్‌ను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కృష్ణమ్మ పరవళ్లు

కృష్ణ , జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. నారాయణపేట జిల్లా, కృష్ణ రైల్వే వంతెన వద్ద నిండుగా ప్రవహిస్తోంది. ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతోంది. అక్కడి నుంచి దిగువనున్న కృష్ణ, భీమా నదులకు వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని సుకూరు లింగపల్లి, కూసుమూర్తి, తంగడిగి, హిందూపూర్, ముడుమాల్, మురహర్ దొడ్డి తదితర గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మత్స్యకారులు చేపల వేట కోసం నదిలో దిగకూడదని హెచ్చరించారు.



కృష్ణ రైల్వే వంతెన వద్ద నిండుగా పారుతున్న కృష్ణానది

జిల్లాలో విస్తారంగా వానలు

మహబూబ్‌నగర్/ నారాయణపేట/ నాగర్‌కర్నూలు/ వనపర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూడు రోజులుగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో అత్యధికంగా 78.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మహ్మదాబాద్‌లో 54.9, హన్వాడలో 55.3, మూసాపేటలో 45.5, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 41.3, నవాబ్‌పేట 33.7, జడ్చర్ల 37.5, మిడ్జిల్ 37.6, భూత్పూర్‌లో 34.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.
- నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో 69.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మక్తల్ మండలంలో 6.5, నర్వ మండలంలో 60.8, మరికల్‌లో 47.8, కోస్గి, 34.3, మద్దూర్ 30.3, దామరగిద్ద మండలంలో 30.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో 64.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ మండలంలో 46.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

» పరారీలో మరో నిందితుడు
» రూ. 15 లక్షల విలువైన సిగరెట్ కాటన్లు, వ్యాన్ స్వాధీనం
» జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, చిత్రంలో సీఐ, ఎస్ఐ

గద్వాల క్రైం, జులై 22 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజలో సిగరెట్ల కాటన్ బాక్స్‌ల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. అయిజ మండల కేంద్రంలో జయలక్ష్మి ఏజెన్సీకి సంబంధించి రూ. 18 లక్షల విలువైన సిగరెట్ కాటన్లు చోరీకి గురైనట్లు ఈ నెల 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ టాటా బాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి, దొంగలను గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన రతన్‌లాల్, స్నేహితుడు బీర్బల్, అతడి అల్లుడు జగదీశ్‌లు సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాట పట్టారు. ఈ నెల 11న రాత్రి వారు మారుతి సుజుకీ ఎకో వ్యాన్‌లో అయిజలోని జయలక్ష్మి ఏజెన్సీ వద్దకు చేరుకున్నారు. తలుపులను పగులగొట్టి సరఫరాకు సిద్ధంగా ఉన్న రూ. 18 లక్షల విలువైన సిగరెట్ కాటన్లను ఎత్తుకెళ్లారు. సంఘటనపై యజమాని వినయ్‌కుమార్ మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.

చోరీ చేసిన సిగరెట్ కాటన్లను విక్రయించేందుకు రతన్‌లాల్, జగదీశ్ లు ఈ నెల 21న తమ వ్యాన్‌లో అయిజ నుంచి ఎరిగెర మీదుగా కర్ణాటకలోని బెల్గాం వైపునకు తీసు కెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ. 15 లక్షల విలువైన సిగరెట్లు, రెండు మొబైల్ ఫోన్లు, వ్యాన్, ఇనుపరాడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ అరెస్టు చేశారు. పరారీలో ఉన్న బీర్బల్ బిష్ణయ్‌ని త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మొగులయ్య, సీఐ టాటా బాబు, అయిజ ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, పెళ్లి పేరుతో వంచన

» డీఎస్పీకి ఫిర్యాదు చేసిన యువతి

గద్వాల క్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన యువకుడు, తనను మోసం చేశాడంటూ ఓ యువతి మంగళవారం డీఎస్పీ మొగిలయ్యకు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన యువతి పోటీ పరీక్షల కోసం 2023లో హైదరాబాద్‌లో శిక్షణ పొందింది. ఆ సమయంలో జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌గౌడ్‌తో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. ఉద్యోగం వచ్చాక పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో డబ్బులు ఇవ్వడంతో పాటు, సన్నిహితంగా మెలిగింది. తీరా అతడికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చాక పెళ్లి ఊసే ఎత్తడం లేదు. దీంతో ఆమె ఈనెల 16న చిన్నోనిపల్లిలోని అతడి ఇంటికి వచ్చింది. ఆమెపై రఘునాథ్‌గౌడ్ బంధువు వీరేశ్ దాడి చేయడంతో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిపైనా కేసు నమోదు చేశారు. ఇదే విషయంపై మంగళవారం ఆమె జిల్లా కేంద్రానికి వచ్చి, డీఎస్పీ మొగిలయ్యకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా, ఇప్పటికే అతడిపై కేసు నమోదు చేశామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒకే రోజు ఐదు ఇళ్లలో చోరీ



బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న సీఐ నాగార్జున

కల్వకుర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో ఒకే రోజు రాత్రి ఐదు ఇళ్లలో దొంగలు పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్వకుర్తి పట్టణంలోని వాసవీనగర్ కాలనీకి చెందిన చంద్రయ్యగౌడ్, కృష్ణయ్య, మహమ్మద్ సుల్తాన్, రిటైర్డు హెడ్ కానిస్టేబుల్ ఖాజామైనొద్దీన్, అనిల్‌లు వారి ఇళ్లకు తాళం వేసి వివిధ పనులు, తీర్థయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లారు. సోమవారం రాత్రి దొంగలు వారి ఇళ్ల తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. చంద్రయ్యగౌడ్ ఇంట్లో రూ.15 వేలు, అనిల్ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, మరొకరి ఇంట్లో 10 తులాల వెండి ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం విషయం వెలుగులోకి రావడంతో సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ద్వారా వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య



మౌనిక (ఫైల్)

ఊర్కొండ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని బావాజీ తండాలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన జర్పులా వత్ మౌనిక (18) మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన బోనాల ఉత్సవాలకు సోదరుడితో కలిసి వెళ్లి మంగళ వారం తిరిగి వచ్చింది. ఆ తర్వాత ఆమె గదిలోకి వెళ్లి తలుపులు మూసుకొని, ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. కారణాలు తెలియాల్సి ఉందని స్థాని కులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత...

మూసాపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలంలోని వేములలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి గ్రామానికి చెందిన వి.అంజలి (30) ఆదివారం గడ్డిమందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా అసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ అసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణ సమీపంలోని సోమవారం రాత్రి జరిగింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్జిల్ మండలంలోని లింబ్యాతండాకు చెందిన కాట్రావత్ కిషన్(35) మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి అతడు ద్విచక్రవాహనంపై తండా నుంచి జడ్చర్లకు వస్తుండగా, స్నేహ కోళ్లదాన పరిశ్రమ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై కిషన్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన హన్మంతు అదృశ్యమైనట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. ఈ నెల 16న హన్మంతు, భార్య కళావతిల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె తల్లిగారి ఊరు వనపర్తికి వెళ్లి మంగళవారం తిరిగి వచ్చింది. ఇంట్లో భర్త కనిపించలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో పాలమూరు విద్యార్థినులు సత్తా చాటారు. హైదరాబాద్‌లో ఈ నెల 20న జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల 5 కిలోమీటర్ల రోడ్ స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న రామ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రణతి, గీతిక, జ్యోతి రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీహెచ్‌ఎం అంజలీదేవి విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ బి. పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో జీహెచ్‌ఎం అంజలీదేవి, పీఈటీ పుష్ప

ఇంటర్వ్యూ

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- నరేష్ కుమార్, ఎస్ఐ



గోపాల్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన చోరీల నేపథ్యంలో ప్రతీ గ్రామంలో ప్రతీ ఒక్కరు చందాలు పోగుచేసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ నరేష్ కుమార్ అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

మండలంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయి.?

శాంతి భద్రతలు అందుపులోనే ఉన్నాయి. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నాలుగు దుకాణాలకు ఒక కెమెరా పెట్టుకుంటే బాగుంటుంది.

ప్రమాదాలు ఏమైనా జరుగుతున్నాయా?

అక్కడక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి.

డ్రంకెన్ డ్రైవ్‌పై కేసులు చేశారా?

గ్రామాల్లో వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాం. నిత్యం మా సిబ్బంది ప్రధాన రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేసి, కేసులు నమోదు చేస్తున్నాం.

గస్తీలు నిర్వహిస్తున్నారా?

రాత్రి సమయంలో పెట్రోలింగ్ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతున్నారు. ప్రజలు ఎవరైనా అనుమానితులుగా కనిపిస్తే.. పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదా పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలి.

న్యూస్ బాక్స్

బంగారు పతకం సాధించిన పోలీస్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

గోపాల్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో రెండు బంగారు పతకాలు సాధించిన మండల పోలీస్‌కు గ్రామస్థులు ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికారు. మండలం లోని బుద్ధారానికి చెందిన కృష్ణారావు హైదరాబాద్‌లో డీజీపీ ఆఫీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అమెరికాలో వరల్డ్ పోలీస్ అండర్ ఫైర్ గేమ్స్‌లో 80 దేశాలు పాల్గొన్నాయి. మన దేశం నుంచి కృష్ణారావు పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించాడు. కృష్ణారావు స్వదేశానికి తిరిగి వస్తున్న సందర్భంగా బుద్ధారం గ్రామస్థులు వారికి పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

వనపర్తి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని మరికుంట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే, (రాష్ట్ర బాల ఆరోగ్య కార్యక్రమం) ఆధ్వర్యంలో ఎంహెచ్‌టీ 4 (మొబైల్ హెల్త్ టీం) వైద్యులు విద్యార్థులకు ఎత్తు బరువులను, రక్తహీనత, కంటి చూపు చర్మవ్యాధులు పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. వైద్యులు రఘు, స్వప్న, శ్రీవిద్య, లక్ష్మి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు దాతకు సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అమరచింత, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఉప్పరి తిరుపతి సొంత డబ్బులతో పట్టణంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాడు. పట్టణంలోని శ్రీ కాళికాదేవి, పోచమ్మ దేవి, భక్త మార్కండేయ ఆలయాల వద్ద, శ్రీకృష్ణ నగర్‌లోని పీర్ల మసీదు వద్ద హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయించాడు. దీంతో పోచమ్మ దేవి బోనాల ఉత్సవం సందర్భంగా ఉప్పరి తిరుపతికి పోచమ్మ దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జంగం శివానంద్, తాటికొండ రమేష్, లావణ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

టై, బెల్టుల పంపిణీ

పెద్దమందడి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాల సీపీఎస్ పెద్దమందడిలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రోజా రాణి తన తండ్రి లక్ష్మణరావు జ్ఞాపకార్థం రూ. 10 వేల విలువ చేసే టై, బెల్టులను మండల విద్యాధికారి మంజులత చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. శాంతన్న, బండి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమమే పీఆర్టీయూ లక్ష్యం

పెబ్బేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ సంఘం ప్రధాన లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మోరెడ్డి బౌద్ధా రెడ్డి, సూర చంద్రశేఖర్ అన్నారు. పీఆర్టీయూ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ పాఠశాలల్లోని ఉపాధ్యయులతో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. చిన్న రాములు, నరసింహ, శివశంకర్ పాల్గొన్నారు.

మరమ్మతులు మరిచారు

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- విన్నవించినా పట్టించుకోని అధికారులు, పాలకులు
- సొంత డబ్బులతోనే మరమ్మతులు

పానుగల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి కాలువలు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా చేరేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టడంలేదు. దీంతో వర్షాకాలం సీజన్‌లో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు కాలువ మరమ్మతులు చేపట్టాలని వినతిపత్రాలు అందజేసినా వారు స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమి లేక రైతులు కొంత నగదును పోగు చేసి యంత్రాలను పెట్టి, మరికొన్ని ప్రాంతాల్లో రైతులే స్వయంగా కాలువలోకి దిగి పనులు చేసుకుంటున్నారు.

- మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో కేఎల్‌ఐ డీ 1 కాలువ పరిధిలో 300 ఎకరాల వరకు గిరిజన రైతులు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా.. సమస్య పరిష్కరించకపోవడంతో కాలువలో పేరుకుపోయిన జమ్ము, మట్టిని తొలగించే పనులు చేసుకుంటున్నామని గిరిజన రైతులు వాపోతున్నారు.

- బుసిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని 27వ ప్యాకేజీ మైనర్ 6వ డిస్ట్రిబ్యూటర్ కాలువ పరిధిలో బుసిరెడ్డిపల్లి గ్రామం వీపనగండ్ల మండల పరిధిలోని పుల్గర్‌చర్ల, శ్రీరంగాపూర్ మండల కేంద్రంతో పాటు మరికొన్ని గ్రామాలకు సాగునీరు అందుతుంది. దాదాపుగా 20 వేల ఎకరాలకు పైగా ఈ కాలువ పరిధిలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ కాలువలో పేరుకుపోయిన జమ్ము, మట్టి, పిచ్చి మొక్కలు, పెద్ద రాళ్లు తొలగించకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడంలేదు. దీంతో రైతులు కొంత నగదును పోగు చేసి ఎక్సకవేటర్‌ను పెట్టి కాలువల్లో పేరుకుపోయిన జమ్మును తొలగించే పనులు చేసుకుంటున్నట్లు రైతులు వాపోయారు.



బుసిరెడ్డిపల్లిలో యంత్రాలతో జమ్మును తొలగిస్తున్న రైతులు, కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము

అధికారులు స్పందించాలి

మాకు కాలువ ద్వారా ఐదు ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువలో పేరుకుపోయిన జమ్మును అధికారులు తొలగించకపోవడంతో రైతులమే జమ్ము తొలగించుకునే పని చేసుకున్నాం.

- వడ్డెమాన్ ఈశ్వర్, బుసిరెడ్డిపల్లి రైతు

రెండు రోజుల్లో తొలగిస్తాం..

సమస్య ఉన్నది వాస్తవమే. ఉన్నత అధికారుల సూచన మేరకు రెండు రోజుల్లో జమ్ము, మట్టిని తొలగించేందుకు పనులు ప్రారంభిస్తాం.

- కేశవరావు, భీమా ఈఈ

దరఖాస్తుల పరిష్కారానికి వేగంగా చర్యలు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తిరాజీవ్ చౌరస్తా, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి, వెనుకబడిన సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, దేవాదాయ అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లతో జిల్లాలోని ఆయా శాఖల పనితీరుపై వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సు సందర్భంగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఏ.ఐ ద్వారా సులువుగా పాఠాలు

వనపర్తి రాజీవ్ చౌరస్తా : అభ్యాసన సామర్థ్యం తక్కువగా ఉన్న విద్యార్థులు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ కంప్యూటర్ ద్వారా సులభంగా పాఠాలు నేర్చుకోవచ్చని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటూ విద్యా సామర్థాలు తక్కువగా ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రతీ రోజు అరగంట ఏ.ఐ ద్వారా విద్యా బోధన చేయాలని ఆయన ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రాథమిక, హై స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ ఏ.ఐ విద్యా బోధన ప్రారంభం అయినప్పటికినీ ఇంటర్నెట్, హెడ్ సెట్, కంప్యూటర్ స్థాపన తదితర సమస్యల పై సమీక్ష నిర్వహించారు.

రాష్ట్ర సమాచార కమిషనర్‌కు ఫిర్యాదు

అమరచింత, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఔట్‌సోర్సింగ్, పారిశుధ్య, వారసత్వ ఉద్యోగాలపై అమరచింతకు చెందిన కృష్ణమూర్తి రాష్ట్ర సమాచార కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో అమరచింత మునిసిపాలిటీలో నియమించిన ఈ ఉద్యోగాలపై ఆర్టీఏ చట్టం ద్వారా సమాచారం కోరగా మునిసిపల్ అధికారులు అసంపూర్తి సమాచారం ఇవ్వడంతో రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గోపాల్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కామన్ గడ్డ కాలనీకి చెందిన లక్ష్మి తన వ్యవసాయ పొలంలో గేదెలు పెట్టుకొని జీవిస్తుంది. రోజూ లాగే మంగళవారం పొలాల్లో మేత మేసేందుకు గేదెలు వెళ్లాయి. మధ్యాహం సమయంలో పక్క పొలంలో గేదె మేసుకుంటూ మోటార్ కరెంటు తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే గేదె మృతి చెందింది. అధికారులు తనను ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

వనపర్తి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : దారిద్రరేఖకు దిగువన ఉన్న స్వర్ణకారులు, స్వర్ణకార యువతను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకార ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని మాజీ కౌన్సిలర్, స్వర్ణకార సంఘం జిల్లా నాయకుడు పుట్టోజు బ్రహ్మచారి మంత్రులను కోరారు. మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి నేతృత్వంలో సచివాలయంలో మంత్రుల చాంబర్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటీ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను వేర్వేరుగా కలిసి ఫెడరేషన్ ఏర్పాటుకు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం ఇస్తున్న బ్రహ్మచారి

గంగమ్మ తెప్పోత్సవం

ఖిల్లాఘణపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో గంగపుత్రులు మంగళవారం ప్రత్యేక పూజలు చేసి గంగమ్మ అమ్మ వారికి తెప్పోత్సవం కార్యక్రమం నిర్వహించారు. గంగమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మ వారి ఉత్సవ విగ్రహాలను గంగమ్మ ఆలయం నుంచి గణప సముద్రం చెరువు వరకు ప్రధాన రహదారిపై ఊరేగించి అమ్మ వారికి విగ్రహాలకు తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. గంగపుత్రులు ఆటపాట, కోలాటం, బొడ్డెమ్మలు వేస్తు గ్రామంలో సందడి చేశారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఖిల్లాఘణపురం గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



పూజలు చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పెబ్బేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం ఎడ్యూకేషన్ ఏఈ కవీందర్ రెడ్డితో కలిసి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల ఆవరణాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణ లోతట్టుగా ఉండటంతో వర్షా కాలంలో నీరు నిల్వ ఉంటుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, అధికారులు, నాయకులకు ఆదేశాలు ఇవ్వడంతో వారు పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రామన్ గౌడ్, రాములు, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, యుగేంధర్ రెడ్డి, తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం

ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి కృషి చేస్తున్న దాతల సహకారం అభినందనీయమని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ మొరం మట్టి కొట్టించి ఎక్సకవేటర్‌తో చదును చేయించారు.

స్థానిక ఎన్నికల్లో వనపర్తిని కైవసం చేసుకుంటాం..

వనపర్తి రూరల్ జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీ గెలుపుతో వనపర్తి మండలాన్ని కైవసం చేసుకుంటాం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఆదేశాల మేరకు మంగళవారం వనపర్తి మండల పరిధిలోని నాగవరం తండాలోని శ్రీనిధి బ్యాంకెట్ హాల్‌లో మండల అధ్యక్షుడు ఎస్ వెంకటేష్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై మండల స్థాయి కార్యశాల నిర్వహించారు. మండల కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తూ పోటీ చేయబోయే అభ్యర్థుల ఎంపిక, గెలుపు కోసమై అనుసరించాల్సిన ప్రణాళికను కార్యాశాలలో దిశా నిర్దేశం చేశారు. పోటీ చేసే బీజేపీ అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ప్రచారం కొనసాగించాలని అన్నారు. గ్రామాల్లో ప్రతీ ఇంట్లో ప్రచారంతో సంబంధం లేకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులుగా ఉన్నారనే విషయాన్ని గుర్తు చేయాలన్నారు. బండారు కుమారస్వామి వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు, బాలరాజ్, సుదర్శన్ రాజేందర్, రాజేష్, అంజి, వెంకటేష్ నాయక్ లక్ష్మీకాంత్ రెడ్డి, చిన్నయ్య యాదవ్, సత్యనారాయణ రావు, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

పోడు భూములకు పట్టా ఇవ్వాలి

పాన్‌గల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : అటవి హక్కుల చట్టం ప్రకారం 40 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న పోడు భూములకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు పట్టా ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం గిరిజనులకు పట్టా ఇవ్వకుండా కాలయాపన చేయడం సరైన విధానాలు కాదని తెలంగాణ గిరిజన సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి బాల్యా నాయక్ అన్నారు. మండల పరిధిలోని కిష్టాపూర్ శివారులో గిరిజనులు సాగు చేస్తున్న భూములను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ భూముల్లో బోరు, పాటు విద్యుత్ సరఫరా చేసుకున్నామన్నారు. నేటికీ భూములకు పట్టాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవి, బాబు, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

వీపనగండ్ల, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో నరసింహ ఉపాధ్యాయులకు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నాగర్లబండ తండా, వల్లభాపురం, వల్లభాపురంతండా పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

రైతులు ఫార్మర్ ఐడీ పొందాలి

పెబ్బేరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమి ఉన్న ప్రతీ రైతు తప్పకుండా ఫార్మర్ ఐడీ పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మున్నా కోరారు. మంగళవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడారు. ప్రతీ పౌరుడికి ఆధార్ కార్డు గుర్తింపు కార్డు మాదిరిగానే ప్రతీ రైతు ఫార్మర్ ఐడి ఉండాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పాన్‌గల్, జూలై 22(ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేయడం వాటిని ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని తహసీల్దార్ అబ్రహం లింకన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి రాజశేఖర్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండని అమ్మాయికి 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి పెళ్లిళ్లు చేయకూడదన్నారు. అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కోటి గొంతుకల రుద్రవీణ దాశరథి

వనపర్తి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): నా పేరు ప్రజా కోటి, మా ఊరు ప్రజావాణి అన్న ప్రళయ కవితామూర్తి కోటి గొంతుకల రుద్రవీణ దాశరథి కృష్ణమాచార్యులు అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో దాశరథి కృష్ణమాచార్యుల 101వ జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు నిర్వహించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రం అందజేత



ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఆత్మకూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని శ్రీవాణి హైస్కూల్ పాఠశాల విద్యార్థులు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (ఎన్‌సీసీ) నిర్వహించినందుకు గాను పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయ బృందాన్ని కేంద్ర సహాయ మంత్రి ప్రతాప్ జాదవ్ ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను అభినందిస్తూ.. ప్రశంసా పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలి

వనపర్తి టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్యలో నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని తక్షణమే ఆపాలని బసవన్న గడ్డ కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి సెల్ టవర్ నిర్మాణం ఆపాలని వినతిపత్రం ఇచ్చారు. ఎండీ ఫజిల్, బాలరాజుగౌడ్, భాస్కర్‌గౌడ్, కృష్ణయ్య, జగదీష్, జయలక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేద్దాం..

కొత్తకోట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందించి స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలువడానికి ఐక్యమత్యంగా కదులుదామని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ అధ్యక్షతన మండల సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. అమలవుతున్న పథకాలను ప్రజలకు చెప్పాల్సిన అవసరం మనపై ఉందన్నారు. ఏ లబ్ధిదారుడికైనా పథకం అందకుంటె వివరాలు తీసుకొని అధికారులతో మాట్లాడాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఈ కృషికి వచ్చే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచినప్పుడే సార్థకత ఉంటుందని, అందుకోసం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, బోయెజ్, కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ బాబు, వెంకటరమణ, గోకరయ్య, సురేందర్ రెడ్డి, శివరాములు, రాంలాల్ నాయక్, శివరాజ్, అభిమన్య, బాలరాజు, మన్యం, వీరేష్‌లింగం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో సౌకర్యాలు కల్పించాలి

వనపర్తి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : డబుల్ బెడ్‌రూంలలో నివాసం ఉంటున్న పేదలకు సౌకర్యాలు కల్పించాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి మండల పరిధిలోనే చిట్యాల శివారులోని డబల్ బెడ్‌రూం కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సౌకర్యాలు లేవని మండిపడ్డారు. ప్రధాన రోడ్డు నుంచి లింకు రోడ్డు లేక అవస్థలతో వెళ్తున్నామని అన్నారు. దాదాపు 20 బ్లాక్‌లకు తాగునీటి సౌకర్యం లేక అల్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూం. సొసైటి అధ్యక్షుడు సర్దార్ ఖాన్, సీపీఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, సతీష్, గంధం భరత్, రాము పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

కేరళ మాజీ సీఎం మృతికి సంతాపం

అమరచింత, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం పార్టీ కురువృద్ధుడు, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతికి సోమవారం అమరచింతలో సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీపీఎం జెండా కట్టల వద్ద పార్టీ పతకాన్ని అవతనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ... 1964లో సీపీఎం పార్టీ ఏర్పాటులో కీలక వ్యక్తిగా వ్యవహరించారని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, ఆర్ఎన్ రమేష్, వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : సీపీఎం పార్టీ దిగ్గజం, కురువృద్ధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి సీపీఎం పార్టీకి తీరని లోటని ఆత్మకూరు సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. 1964లో సీపీఎం పార్టీ ఏర్పాటులో కీలక వ్యక్తిగా వ్యవహరించారని తెలిపారు.

వార్డుల్లోని సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ... మునిసిపాలిటీ పరిధిలోని 10 వార్డుల్లో పారిశుధ్య పనులతో పాటు డ్రైనేజీ నిర్మాణాలు సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మునిసిపల్ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల పట్టణ అధ్యక్షుడు రాజన్న, ప్రసాద్, కురుమన్న, జిలాని, ఆనంద్, సత్తన్న, భక్తరాజు, సత్యనారాయణ, రామచందర్ పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

వనపర్తి రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు తీర్చాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్తన్న చారి గౌరవ అధ్యక్షుడు శ్రీధర్ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో విశ్రాంతి ఉద్యోగుల భవనంలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఆగస్టు 2న చలో ఢిల్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రామచంద్ర రెడ్డి, రాఘవరెడ్డి, లక్ష్మీనారాయణ, గురువయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే పట్టణ అభివృద్ధి

వనపర్తి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలోనే పట్టణ అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 24వ వార్డులో ఆ పార్టీ నాయకులతో ఆయన పర్యటించారు. గట్టు యాదవ్ మాట్లాడుతూ బండారు నగర్‌లో దాదాపు రూ.2 కోట్లతో గత ప్రభుత్వం స్పెషల్ ఫండ్ ద్వారా సీసీ రోడ్లు ప్రాథమిక పాఠశాలల పునరుద్ధరణ, మహిళా భవన్, డ్రైనేజీలు, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా.. వార్డులో ఒక్క అభివృద్ధి పని చేయలేదని విమర్శించారు. నాయకులు వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, పరంజ్యోతి ,తిరుమల్, నాగన్న యాదవ్, బండారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాల కార్మికులుగా మారిస్తే చర్యలు

- విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులను బాల కార్మికులుగా మారిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ 2 జె నరేష్ తెలిపారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు మంగళవారం ఆపరేషన్ ముస్కాన్ 2లో మండల కేంద్రంలోని దుకాణాల్లో బాల కార్మికులు ఉన్నారా అని తనిఖీ చేశారు. బైక్ మెకానిక్ దుకాణంలో 17 సంవత్సరాల బాలుడు చదువుకోకుండా పనిలో పెట్టుకున్న దుకాణం యజమాని దాసరిపల్లి బాలయ్యపై కేసు నమోదు చేశారు.

వాహనంలో తరలిస్తుండగా..

దుకాణాలు తనిఖీ చేసే సందర్భంలో మండల కేంద్రంలోని శ్రీనివాస క్లాత్ షోరూంలో ఒక అబ్బాయి పని చేస్తున్నాడని గుర్తించి బాల రక్ష వాహనంలో తరలించే ప్రయత్నం చేస్తుండగా.. రేణుక వైన్స్ వద్ద బాల రక్ష వాహనంను అడ్డగించి వాహనాన్ని ఆపి ఇండియన్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులతో మండల కేంద్రానికి చెందిన కాగితాల కృష్ణ వాగ్వాదం చేస్తూ.. విధులకు ఆటంకం కల్పించారు. ముస్కాన్ టీం సభ్యులను అడ్డుకున్నట్లు చైల్డ్ లైఫ్ కౌన్సిలర్ రాజేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కాగితాల విష్ణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ 2 జె నరేష్ తెలిపారు.

అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాలు



కొత్తకోట మండలం చర్లపల్లిలో బోనాలతో వస్తున్న మహిళలు

అమరచింత/ కొత్తకోట / ఖిల్లాఘణపురం, జూలై 22(ఆంధ్రజ్యోతి) : ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఘణపురం కిందిగేరి, కొత్తకోట మండలంలోని చర్లపల్లి గ్రామంలో అమరచింత మండల కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్‌లో పోచమ్మ తల్లి బోనాలు మంగళవారం అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోచమ్మ తల్లికి బోనాలను సమర్పించడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో ఆడపడుచులు తరలివచ్చారు.



ఖిల్లాఘణపురంలో..



అమరచింత పోచమ్మ ఆలయం వద్ద భక్తులు